

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 325 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 27, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# జై భీమ్ యాధిలో.. జెంజీ ఉద్యమం !








డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



వారణాసి నుంచి రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి నాంది పలికానని జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీపై 2024 లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతోనే తన రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రశ్నించే విద్యార్థులు, మేధావుల గొంతుకను అణచివేయకూడదని అభిప్రాయపడ్డారు. దేశంలో మత సామరస్యం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కులు బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న యువతకు ప్రజాస్వామ్యవాదులు అండగా నిలవాలని కోరారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సహా పలువురు నాయకులు రాజ్యాంగ పరిరక్షణకు చేస్తున్న కృషిని అభినందించారు. ప్రభుత్వ వ్యవస్థలు రాజ్యాంగబద్ధంగా, స్వతంత్రంగా పనిచేసేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం సాధించడమే ఉద్యమాల ప్రధాన లక్ష్యం కావాలని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. - హైదరాబాద్( జై భీమ్ డెస్క్)

2

వారణాసిలో మొదలైన భారత రాజ్యాంగ రక్షణ పోరాటం.

అవకాశాన్ని ఆయుధంగా మలుచుకున్న రాజ్యాంగ రక్షణ యువకుడు.....

దేశంలో మతకల్లోలాలు సృష్టిస్తున్న కేంద్రం.

దేశ ప్రధానిపై పోటీ చేయాలంటే దమ్ము ఉండాలి.

మూడేళ్ల ముందే ఉద్యమానికి తెరలేపిన జై భీమ్ సంస్థల చైర్మన్.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే బలమైన సంకల్పాన్ని బలపరిచారు.

దేశంలో జరగబోయే అల్లకల్లోలాలను ముందస్తుగానే పసిగట్టాడు.

దేశ పరిస్థితులు చక్కబడాలంటే భారతరాజ్యాంగం బలపడాలి.

రాజ్యాంగ రక్షణకు సహకరిస్తున్న రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి ప్రియాంకక్ ఖర్గే, విజయ్ కుమార్, ప్రకాష్ రాజ్ లను అభినందించాలి.

దేశం కోసం జీవితాలను త్యాగం చేసుకుంటున్న సిజెపి ప్రతినిధులు.

దేశ రక్షణలో ఉద్యమ తీవ్రతకు విరోచిత సహకారం అందాలి.

డాక్టర్ బరిగెల శివ

## యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాలి!

ఉద్యోగ అవకాశాల కల్పనతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలి

ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టిని కలిసిన డా. బరిగెల శివ

నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి

ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి

యువతకు అవకాశాలు కల్పిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

3





ఎల్‌నినోపై ముందస్తు కార్యాచరణ చేపట్టాలి!

## సీఎం సీపీఆర్‌ఓ మల్సూర్‌తో డా. బరిగెల శివ భేటీ

పేదలు, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

వర్షపాత మార్పులపై ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా ఉండాలి

గ్రామీణ ఉపాధి, రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి

జై భీమ్ టీవీ, దినపత్రిక సేవలను అభినందించిన మల్సూర్

3





## తెలంగాణ ఆరోగ్య శాఖ అప్రమత్తం!

107 ఆసుపత్రుల్లో జనరేటర్ల ఏర్పాటు

జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్ల నిధులు విడుదల

ఆసుపత్రుల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

భారీ సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకుల ఏర్పాటుపై దృష్టి

రోగులకు నిరంతర వైద్య సేవలే ప్రధాన లక్ష్యం

2

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అంశం పక్కాగా నమోదు చేయాలి!

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

పెండింగ్ నోటీసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి

భౌతిక, ఆన్‌లైన్ రికార్డులను భద్రంగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# సన్న బియ్యం సరఫరాలో భారీ అక్రమాలు!

**రూ.243.69 కోట్ల బోనస్‌కు సంబంధించి ఆర్థిక నష్టం అంచనా.. 14 మంది మిల్లర్ల అరెస్ట్**



**హైదరాబాద్, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్ 2025--26 సీజన్‌కు సంబంధించి సన్న రకం ధాన్యం నుంచి బియ్యం సేకరణ, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి సరఫరా చేసే ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై తెలంగాణ పోలీస్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) దర్యాప్తు చేపట్టింది. ఈ వ్యవహారంపై పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (ప్రొక్యూర్‌మెంట్) అక్టోబర్ 24, 2026న ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి.

**లక్ష్యానికి మించి ధాన్యం సేకరణ**

తెలంగాణ ప్రభుత్వం ఖరీఫ్ 2025--26 సీజన్‌లో 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా చేయడానికి 59.60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం నిర్దేశించినట్లు సీఐడీ ప్రెస్‌నోట్‌లో పేర్కొంది.అయితే, కొందరు రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన సన్న రకం ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌కు తరలించి, దాని స్థానంలో తక్కువ ధర కలిగిన దొడ్డు రకం బియ్యాన్ని సరఫరా చేసినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడించింది. ఇందులో ఇతర రాష్ట్రాల నుంచి సేకరించిన బియ్యాన్ని వినియోగించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

**ప్రయోగశాల పరీక్షల్లో నాణ్యతపై అనుమానాలు**

ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు నిర్వహించిన తనిఖీల అనంతరం సేకరించిన బియ్యం నమూనాలను ప్రయోగశాలల్లో పరీక్షించారు. పరిశీలించిన కొన్ని నమూనాలు కేటాయింపుల్లో పేర్కొన్న సన్న రకం బియ్యం ప్రమాణాలకు అనుగుణంగా లేవని సమాచారం వెల్లడైంది. ఈ వ్యవహారం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఒప్పందాల ఉల్లంఘనకు దారితీసిందా? ప్రభుత్వానికి ఎంతమేర ఆర్థిక నష్టం వాటిల్లింది? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

**మూడు జిల్లాల్లో 16 మిల్లులపై ఆరోపణలు**

నిజామాబాద్, కరీంనగర్, ములుగు జిల్లాల్లోని 16 రైస్ మిల్లులు సన్న రకం బియ్యం కేటాయింపులకు బదులుగా 3,385.820 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం బియ్యాన్ని సరఫరా చేసినట్లు ప్రెస్‌నోట్‌లో పేర్కొన్నారు. ఈ సరఫరాకు సంబంధించిన బోనస్ రూపంలో సుమారు రూ.1.69 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.ఇదే సమయంలో మరో 45,414.833 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ కోసం కేటాయించినట్లు సమాచారం. దీనికి సంబంధించిన బోనస్‌పై సుమారు రూ.242 కోట్ల మేర ఆర్థిక ప్రభావం ఉండవచ్చని అంచనా వేశారు. అయితే, ఈ మొత్తం వాస్తవ నష్టంగా నిర్ధారించబడినట్లు కాదు.పౌరసరఫరాల శాఖ అధికారులు సకాలంలో స్పందించి, తదుపరి సరఫరాలను నిలిపివేయడంతో మరింత ఆర్థిక నష్టం జరగకుండా అడ్డుకున్నట్లు సీఐడీ వెల్లడించింది.

**మూడు క్రిమినల్ కేసులు.. 14 మంది మిల్లర్ల అరెస్ట్**

ఈ వ్యవహారంలో ఇప్పటివరకు మూడు క్రిమినల్ కేసులు నమోదు కాగా, 14 మంది రైస్ మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు సీఐడీ ప్రెస్‌నోట్‌లో తెలిపింది. ధాన్యం మళ్లింపు, బియ్యం రకం మార్పిడి, కేటాయింపులు మరియు మిల్లింగ్ అనుమతుల ప్రక్రియలో ఎవరి పాత్ర ఎంతవరకు ఉందనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.సంబంధిత పత్రాలు, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను సేకరించడంతో పాటు, ప్రభుత్వ అధికారుల ప్రమేయం ఉందా? నేరపూరిత కుట్ర జరిగిందా? వాస్తవంగా ప్రభుత్వానికి ఎంత నష్టం వాటిల్లింది? అనే అంశాలను పరిశీలిస్తున్నారు.ప్రభుత్వ ధాన్యం సేకరణ, మిల్లింగ్, బియ్యం సరఫరా వ్యవస్థలో పారదర్శకతను నిర్ధారించేందుకు ఈ దర్యాప్తు కీలకంగా మారింది. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై నేరాలు న్యాయస్థానంలో నిరూపితమయ్యే వరకు వారిని దోషులుగా పరిగణించరాదు.

# పోలీసుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం

**22వ డివిజన్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలి**
**మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ స్వామి**

**వరంగల్, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



పోలీసుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఈరోజు అనగా 27వ అక్టోబర్ ఉదయం 9 గంటలకు వరంగల్ ఎమ్మార్వో కార్యాలయం పక్కన ఉన్న ఐఎంఏ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో 22వ డివిజన్‌కు చెందిన కార్యకర్తలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ డివిజన్ మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ స్వామి కోరారు.రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరంలో కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# జై భీమ్ "యాధిలో" జంజీ" ఉద్యమం

**వారణాసిలో మొదలైన భారత రాజ్యాంగ రక్షణ పోరాటం.**
**అవకాశాన్ని ఆయుధంగా మలుచుకున్న రాజ్యాంగ రక్షణ యువకుడు.....**
**దేశంలో మతకల్లోలాలు సృష్టిస్తున్న కేంద్రం.**
**దేశ ప్రధానిపై పోటీ చేయాలంటే దమ్ము ఉండాలి.**
**మూడేళ్ల ముందే ఉద్యమానికి తెరలేపిన జై భీమ్ సంస్థల చైర్మన్.**
**భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనే బలమైన సంకల్పాన్ని బలపరిచారు.**
**దేశంలో జరగబోయే అల్లకల్లోలాలను ముందస్తుగానే పసిగట్టాడు.**
**దేశ పరిస్థితులు చక్కబడాలంటే భారతరాజ్యాంగం బలపడాలి.**
**రాజ్యాంగ రక్షణకు సహకరిస్తున్న రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి ప్రియాంకక్ ఖర్గే, విజయ్ కుమార్, ప్రకాష్ రాజ్ లను అభినందించాలి.**
**దేశం కోసం జీవితాలను త్యాగం చేసుకుంటున్న సిజెపి ప్రతినిధులు.**
**దేశ రక్షణలో ఉద్యమ తీవ్రతకు విరోచిత సహకారం అందాలి.**
**డాక్టర్ బరిగెల శివ**



**హైదరాబాద్( జై భీమ్ డెస్క్)**

దేశ రక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో జంజీల ఉద్యమం కీలకంగా మారిందని డాక్టర్ బరిగెల శివ అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తూ దేశంలో సృష్టిస్తున్న అలజడులను, ఆర్థిక విపత్తులను, మతపరమైన ఉద్దేశపూరితంగా జరుగుతున్న దాడులను ప్రశ్నించడం కోసం, అలాంటి విపత్తుల నుండి దేశాన్ని రక్షించుకోవడం కోసం జంజీ విద్యార్థులు తలపెడుతున్న ఉద్యమాలు ప్రపంచ దేశాలను ఆకర్షించాయని గుర్తు చేశారు. దేశాన్ని కాపాడుకోవాలనే సదుద్దేశంతో జరుగుతున్న మేధావుల పోరాటాలు , మేధావుల ఉద్యమాలు, ఎంత కఠోరంగా అణిచివేయబడుతున్నాయని వాటన్నిటిని దేశ ప్రజలందరూ చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని చట్టాలను అక్రమాలకు, అనుకూలంగా మార్చుకుని ప్రణాళిక ప్రకారంగా ముందస్తుగానే అక్రమాలు చేయడం కోసం దేశ చట్టాలను సవరణ చేసుకున్న విధానం దేశపాలకులు దేశాన్ని ఏ విధంగా నాశనం చేయదలిచారో ముందస్తుగానే తెలిపోయిందన్నారు. భారత రాజ్యాంగాన్ని సమూలంగా నాశనం చేయడం కోసం దేశ పాలకులు పడుతున్న ఆరాటం అంతా ఇంతా కాదని అందులో భాగంగానే దేశవ్యాప్తంగా రాజ్యాంగపరమైన విలువలు ఉండకూడదనే విధంగా రాజ్యాంగ విరుద్ధమైన చట్టాలను ఏర్పాటు చేసుకుంటూ దేశాన్ని విచ్చలవిడిగా నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. దేశ పాలకుల తీరు పట్ల దేశంలోని ప్రజలే కాకుండా ప్రపంచ దేశాలలోని మేధావులు ఎన్నారైలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నప్పటికిని దేశ పాలకుల ఒంటెద్దు పోగొడలు దేశ పాలకుల ముదురుతనాలలో ఏ మాత్రం మార్పు రాకపోవడంతో దేశంలోని యువత ఒక్కసారిగా కదంతొక్కి తిరుగుబాటుతనాన్ని ప్రదర్శిస్తున్నారని గర్వపడ్డారు.

**నేను సైతం "జంజీ"యోధుడినే..**

పోరాటం చేయాలనే తపన వ్యక్తిగతంగా బలపడి ఉండాలే గాని ఎంతటి ఉద్యమాన్ని అయినా చేయడానికి వెనకాడ బోమనేది జై భీమ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షునిగా నా వంతు బాధ్యతను నిర్వహించడానికి గత మూడు సంవత్సరాల ముందే ఉద్యమ తీవ్రతను దేశానికి పరిచయం చేయగలిగినానని గర్వపడుతున్నట్లు తెలిపారు. మొట్టమొదటగా 2014 నుండి మూడవసారి ఎన్నికలు జరిగిన విధానంలో 2023 అన్ని రాష్ట్రాల ఎన్నికలతో పాటు 2024లో దేశవ్యాప్తంగా జరిగిన పార్లమెంటు ఎన్నికలలో దేశ ప్రధాని నరేంద్ర మోడీపై వారణాసిలో పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచి భారత రాజ్యాంగాన్ని చేత పట్టుకొని న్యాయవాదుల సమక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలాలు చేసిన విధానం నా వ్యక్తిగత విశ్వాసాన్ని బలపరచడమే కాకుండా భారత రాజ్యాంగాన్ని స్వతంత్రంగాను నిజాయితీగాను రక్షించాలని ప్రథమ పోరాటానికి నాంది వేసుకున్నానని అభివర్ణించారు. అదే సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి తక్షణపాటుగా స్పందించి దేశంలో జరుగుతున్న పోరాటాల పట్ల భారత రాజ్యాంగాన్ని కచ్చితంగా రక్షించుకొని తీరాలని పలుమార్లు పత్రిక సమావేశం నిర్వహించి 2003లో భారత రాజ్యాంగంపై అప్పటి కేంద్ర ప్రభుత్వమైన బిజెపి చేసిన కుట్రలను బహిర్గతం చేయడమే కాకుండా భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం దేశ ప్రజలందరూ ముందుకు రావాలని సీఎం స్థాయి లాంటి నాయకుడు పిలుపునివ్వడం వెనకాల జై భీమ్ సంస్థల పోరాటం జై భీమ్ సంస్థల వరుస కథనాలు దోహదపడగలిగినాయని బలంగా నమ్ముతున్నామన్నారు. అదేవిధంగా ఏఐసీసీ ప్రధాన నాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో భారత రాజ్యాంగాన్ని చేత పట్టుకొని ఎంపీగా నామినేషన్ వేయడమే కాకుండా ఎన్నికలు ముగిశాక పార్లమెంటులో జరిగిన ప్రమాణస్వీకారంలో పార్లమెంటు సాక్షిగా భారత రాజ్యాంగాన్ని చేత పట్టుకొని ప్రమాణ స్వీకారం చేసిన విధానం ప్రపంచ దేశాలను ఆశ్చర్యపరచిందన్నారు. అన్నింటికన్నా ప్రధానంగా మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోయే ముందు దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పాదాభివందనం చేస్తూ తన కంఠంలో ప్రాణం ఉండగా భారత రాజ్యాంగానికి ప్రమాదం జరగనివ్వనని ప్రమాణం చేసిన విధానం జై భీమ్ సంస్థల పోరాటమే అంటూ అభిమానించారు.తదనంతరం దేశంలో జరుగుతున్న పరిణామాలు దేశంలో జరుగుతున్న అల్లర్లు దేశంలో జరుగుతున్న గొడవలు దేశంలో జరుగుతున్న ప్రాణాంతక దాడులు పై స్థాయికి పెరిగిపోతుండగా దేశాన్ని చట్టాల పరంగా న్యాయస్థానాలపరంగా రక్షించుకోలేమని భావించిన దేశ యువత నీట్ పేపర్ లీకేజీ తో మొదలుకొని దేశంలో జరుగుతున్న ఎన్నికల సర్ ప్రక్రియ పట్ల ఉద్యమాలు స్థాపించి పోరాటాలకు సిద్ధపడుతుండగా ఉద్యమాలు నిరసనలు పోరాటాలు చేస్తున్న జంజీ విద్యార్థిని,విద్యార్థులపై విధ్వంసభరితమైన దాడులు చేస్తూ ఒకవైపు పోలీసులు మరోవైపు ప్రభుత్వం ఇంకోవైపు కేంద్రబలగాలు అన్నిటికన్నా మించి ఆర్ఎస్ఎస్ గుండాలు విద్యార్థులను చితక్కొడుతుండగా భారతదేశాన్ని భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం యువత రక్తాన్ని కారుస్తుండడం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటాలు చేస్తుండడం దేశంలో ఎప్పుడు జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆగడాలను కేంద్ర ప్రభుత్వ అవినీతిని కేంద్ర ప్రభుత్వ ఆక్రమాలను ప్రశ్నిస్తూ జాతీయ ఎన్నికల కమిషన్, దేశ పార్లమెంట్ ఉభయ సభలు, దేశంలోని న్యాయస్థానాలు బిజెపి ప్రభుత్వానికి వంత పాడుతూ పూర్తిస్థాయిలో సహకరిస్తుండగా దేశ పాలకుల చేతుల్లో నుండి ప్రభుత్వ యంత్రాంగాలను ప్రభుత్వ సంస్థలను స్వతంత్ర వ్యవస్థలుగా పని చేయాల్సిన సంస్థలను రక్షించుకోవడం కోసం దేశ యువత పోరాటాలు చేస్తుంటే నేటి జంజీ ఉద్యమానికి జై భీమ్ సంస్థల చైర్మన్గా డాక్టర్ బరిగెల శివ అను నేను 2023లోని పునాది వేయడం జంజి ఉద్యమకారునిగా గర్వంతో కూడిన అనుభూతిని పొందుతున్నానన్నారు.

**నిరంకుశ పాలనను నిర్మూలించాలి..**

ఉద్యమకారులను విద్యార్థి మేధావులను అర్బన్ నక్సలైట్లుగా ముద్రిస్తూ చిత్రీకరిస్తున్న దేశ పాలకులు సిగ్గుతో తలదించుకునే రోజులు రాబోతున్నాయి అంటూ హెచ్చరించారు. మొన్నటి వరకు ఆపరేషన్ కాగార్ పేరుమీద వందలాది వేలాది మంది నక్సల్స్ సానుభూతిపరులను ఎన్కౌంటర్ల పేర్ల మీద హతమార్చిన కేంద్ర ప్రభుత్వం, రాజ్యాంగ విరుద్ధమైన నిరంకుశ పాలనను చేపట్టిందని అన్నారు. నక్సలైట్లను ఎన్కౌంటర్లు చేయడానికి కేంద్ర ప్రభుత్వం వాడిన ఏకైక సాకు చట్టాలకు న్యాయస్థానాలకు విరుద్ధంగా నక్సల్స్ ఆయుధాలను వాడుతున్నారని వాళ్లను సంఘవిద్రోహశక్తులుగా పరిగణించి ఎన్కౌంటర్లు చేసినప్పుడు. మొన్నటికి మొన్న దసరా పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఆర్ఎస్ఎస్ కు చెందిన వ్యక్తులు మారణాయుధాలను గన్నులను పిస్తోళ్లను ఆయుధ పూజలు చేస్తూ నడిరోడ్లపై మారణాయుధాలతో డ్యాన్సులు ర్యాలీలు నిర్వహించినప్పుడు కేంద్ర ప్రభుత్వ పాలకుల కండ్లు ఎటుపోయాయంటూ హెచ్చరించారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్ఎస్ఎస్ ప్రతి రాష్ట్రంలోని ప్రభుత్వాలకు వాళ్ల సంస్థ ఆధారాలను వెల్లడించకుండా అక్రమమైన పద్ధతిలో వ్యవస్థలను నడిపిస్తూ వేలకోట్ల రూపాయలను పోగుచేసుకొని రిజిస్ట్రేషన్ లేకుండా చలామణి అవుతుండగా అలాంటి వ్యక్తులు దేశానికి ప్రమాదకరంగా మారి జంజీ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను కిరాతకంగా దాడులు చేస్తూ మారణాయుధాలను ఉపయోగించి ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రాంతం వద్ద నడిరోడ్లపై వీరంగం సృష్టిస్తుంటే కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు న్యాయస్థానాలు కేంద్ర పోలీస్ బలగాలు ఏం చేస్తున్నాయి అంటూ ప్రశ్నించారు. చదువుకున్న విద్యార్థులను మేధావులైన విద్యార్థులను దేశ ప్రధాని లాంటి మోడీ అర్బన్ నక్సలైట్ అనే పదం వాడి రాజకీయ దుర్వినియోగానికి పాల్పడినప్పుడు మారణాయుధాలతో రోడ్లపై వికృతి చేష్టలకు పాల్పడుతున్న వ్యక్తులను రిజిస్ట్రేషన్ లేకుండా లక్షలాది మందితో దేశంపై దాడికి పాల్పడుతున్న వ్యవస్థాపక నిర్మాణ శక్తులను ఏమని పిలవాలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ హోం శాఖ మంత్రి అమిత్ షాలు ఎందుకు తెలపడం లేదంటూ హెచ్చరించారు.దేశ పాలకుల చేతిలో నాశనమైపోతున్న భారతదేశాన్ని భారతదేశ ప్రభుత్వ సంస్థలను అన్నిటికన్నా ముఖ్యంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం జంజీల ఉద్యమంతో పాటు దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉద్యమం పేర్ల మీద కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న మేధావి విద్యార్థులను అక్రమ అరెస్టుల పేర్ల మీద జైల్లో నిర్బంధించడం అత్యంత దారుణం అని దానికి భిన్నంగా దొంగలకు మోసగాళ్లకు కేటుగాళ్లకు కీచకులకు మహిళలను రేపులు చేస్తూ అత్యంత హీనంగా అత్యంత దారుణంగా హతమారుస్తున్న క్రిమినల్ గాళ్లకు రక్షణగా నిలవడంలో ప్రభుత్వ రంగ సంస్థల ఆంతర్యం ఏమిటో బయటపడాలన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాల పట్ల మేధావులు న్యాయమూర్తులు రాజకీయ నాయకులు భిన్నమైన స్వరాలను వినిపించకుండా నియంత పోకడలతో కూడిన పరిపాలనను నిర్మూలించడం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశాన్ని ఉన్నత స్థాయిలో రక్షించుకోవాలంటే భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగంలోని చట్టాలను సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ వ్యవస్థలో బలపరచబడాలని ముఖ్యంగా రాజకీయ ఎన్నికల పోకడలు పూర్తిగా మార్చబడాలని సిఐడి సర్ ప్రక్రియ ఎన్నికల విధానం పూర్తిగా మార్చబడగలిగినప్పుడే దేశంలో తప్పులకు పాల్పడుతున్న వ్యక్తులు, అధికార దుర్వినియోగ పాల్పడుతున్న శక్తులు,ఎంతటి రాజకీయ పాలకులైన గజగజ వనిగిపోగలరని హెచ్చరించారు ఇప్పుడున్న సమయంలో ఉన్నపాటుగా దేశాన్ని రక్షించుకోలేకపోతే ముందస్తు మనగడకు తీవ్రమైన ప్రమాదం సంభవించక తప్పదు అన్నారు. భారత రాజ్యాంగం రక్షణ కోసం పాటుపడుతూ పోరాటాలు చేస్తున్న ఉద్యమకారులను రాహుల్ గాంధీని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని, కర్ణాటక హోం శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గేను తమిళనాడు సీఎం విజయ్ ను సినీ నటుడు ప్రకాష్ రాజును, సిజెపి నాయకులను అభినందించుకొని తీరాలన్నారు. మంచితనంతో తలపెట్టే ఎలాంటి ఉద్యమమైన దేశ రక్షణ కోసం సమాజ బాగోగుల కోసం సత్ఫలితాలను ఇవ్వడానికి వెనకాడబోవని ఆత్మగౌరవంతో కొనసాగే పోరాటాలు పెద్ద ఎత్తున ఉద్భవిస్తాయని తెలపడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి పోరాటం చేసిన తన వంతు కృషి ఉద్యమ రూపంలో వనవృక్షంలా మారిపోయి దేశంలో జరుగుతున్న దాడులపై, దేశంలోని వ్యతిరేక శక్తులపై, ప్రభుత్వ సంస్థలైన అధికార యంత్రంగాల ఆగడాలపై నిలువెత్తు ఉద్యమాలను చేస్తాయని దానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన కృతజ్ఞ్యాభి వందనాలు తెలియజేస్తున్నాను అన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదుకు బొమ్మకంటి పిలుపు

**నవంబర్ 6 చివరి గడువు**

**పరకాల, 26 అక్టోబర్ 2026 ( జై భీమ్ న్యూస్)**

అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షుడు, 56వ బూత్ బీఎల్ఏ బొమ్మకంటి చంద్రమౌళి కోరారు.ఉమ్మడి వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తూ, ఓటరు నమోదు ప్రాధాన్యంపై పట్టభద్రులకు అవగాహన కల్పించారు. నవంబర్ 6 చివరి గడువు కావడంతో అర్హులైనవారు వెంటనే నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# ఎల్‌నినోపై ముందస్తు కార్యాచరణ చేపట్టాలి!

## సీఎం సీపీఆర్ఓ మల్సూర్‌తో డా. బరిగెల శివ భేటీ

పేదలు, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
వర్షపాత మార్పులపై ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా ఉండాలి
గ్రామీణ ఉపాధి, రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి
జై భీమ్ టీవీ, దినపత్రిక సేవలను అభినందించిన మల్సూర్



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలని జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డా. బరిగెల శివ సూచించారు. ఈ అంశంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రజా సమస్యలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీపీఆర్ఓ మల్సూర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతంలో మార్పులు సంభవిస్తే వ్యవసాయ రంగంపై పడే ప్రభావం, రైతులు ఎదుర్కొనే సవాళ్లు, పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల జీవనోపాధికి ఎదురయ్యే ఇబ్బందులపై తన అభిప్రాయాలను వివరించారు.

**పేదలపై ప్రభావం పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి**

వాతావరణ మార్పుల ప్రభావం ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడే రైతులు, వ్యవసాయ కూలీలు, రోజువారీ కూలీల కుటుంబాలపై పడే అవకాశం ఉందని డా. బరిగెల శివ పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే పంటల సాగు, గ్రామీణ ఉపాధి, నిత్యావసరాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల వాతావరణ శాఖ అంచనాలకు అనుగుణంగా సంబంధిత ప్రభుత్వ శాఖలు ముందుగానే కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రైతులకు అవసరమైన సహాయం అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కాపాడటం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు సమస్యలు ఎదురైన తర్వాత స్పందించడం కంటే, సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

**జై భీమ్ టీవీ, జై భీమ్ దినపత్రిక సేవలకు అభినందనలు**

ఈ భేటీలో జై భీమ్ టీవీ, జై భీమ్ దినపత్రిక ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అణగారిన వర్గాల గొంతుకగా నిలుస్తూ సామాజిక న్యాయం కోసం చేస్తున్న కృషిని సీపీఆర్ఓ మల్సూర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషిని కొనసాగిస్తానని డా. బరిగెల శివ తెలిపారు.

# హంగు ఆర్భాటాలకు దూరంగా.. ప్రజాసేవే లక్ష్యంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి!





## పేద, బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధికి అండగా.. సామాన్యులకు చేరువగా ప్రజాప్రతినిధి

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

రాజకీయాల్లో పదవులు, హంగు ఆర్భాటాల కంటే ప్రజలకు సేవ చేయడమే ముఖ్యమని తన నిరాడంబరమైన వ్యవహారశైలితో చాటుతున్న ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ప్రజాసేవా దృక్పథం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి ఇప్పటివరకు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు, ముఖ్యంగా విద్యారంగంలో విద్యార్థులకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తూ ప్రజలకు చేరువగా ఉండేందుకు ఆయన కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజాప్రతినిధిగా తనకు లభించిన హోదా, అధికారాలను హంగు ఆర్భాటాల కోసం కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు వినియోగించాలనే ఆలోచన ఆయనలో కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు మరింత చేరువగా ఉండాలనే ఉద్దేశంతో గన్‌మెన్ భద్రతా వ్యవస్థను సైతం వద్దనుకున్న వ్యక్తిగా బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ క్రమంలో అనుకోకుండా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన డాక్టర్ బరిగెల శివ, జై భీమ్ టీవీ ఫౌండర్ & చైర్మన్, అలాగే రాజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ చైర్మన్ ఎస్.ఎస్. రాజు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా పరస్పరం ఆత్మీయ సంభాషణ జరగగా, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి మరింత చురుకుగా ముందుండాలని డాక్టర్ బరిగెల శివ ఆకాంక్షించారు. ఉప్పల్ నియోజకవర్గంలో విద్య, మౌలిక సదుపాయాలు, పేద ప్రజల సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా ఎమ్మెల్యే తన సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ప్రజల మధ్య ఉంటూ, పేదల కష్టాలను అర్థం చేసుకుంటూ, విద్యాభివృద్ధికి తోడ్పడే నాయకత్వమే ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తుంది. పదవికంటే ప్రజాసేవకు ప్రాధాన్యత ఇచ్చే నాయకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారు.

# తెలంగాణ ఆరోగ్య శాఖ అప్రమత్తం!

107 ఆసుపత్రుల్లో జనరేటర్ల ఏర్పాటు.. జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్ల నిధులు విడుదల
ఆసుపత్రుల్లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు
భారీ సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకుల ఏర్పాటుపై దృష్టి
రోగులకు నిరంతర వైద్య సేవలే ప్రధాన లక్ష్యం



హైదరాబాద్, అక్టోబర్ 26(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య శాఖ మౌలిక సదుపాయాల బలోపేతంపై దృష్టి సారిస్తోంది. ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరా అంతరాయాలు, నీటి కొరత కారణంగా రోగులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ప్రాధాన్యతగా మారింది. ఈ క్రమంలో ఎల్ఎన్ఓ పర్యవేక్షణతో పాటు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

**జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్లు**

2025 జూలై 3న జనరేటర్ల కొనుగోలుకు రూ.21.96 కోట్ల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 107 ఆసుపత్రుల్లో విద్యుత్ బ్యాకప్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) డీజిల్ జనరేటర్ల కొనుగోలుకు టెండర్లు పిలిచింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భాల్లో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా జనరేటర్లు ఉపయోగపడనున్నాయి.

**ఆసుపత్రుల్లో నీటి సమస్యకు పరిష్కారం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నీటి కొరత వల్ల రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోకుండా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. పెద్ద సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకులను ఏర్పాటు చేయడం ద్వారా నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ఆసుపత్రుల అవసరాలను తీర్చేందుకు అవకాశం ఉంటుంది.

**ఎల్ఎన్ఓ పర్యవేక్షణతో ముందస్తు చర్యలు**

ఆసుపత్రుల్లో విద్యుత్, నీటి సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టడం కీలకం. జనరేటర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? నీటి ట్యాంకుల్లో తగినంత నిల్వ ఉందా? అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలను నిరంతరం పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**రోగుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం**

నిధుల విడుదల, టెండర్ల ప్రక్రియతోపాటు జనరేటర్ల ఏర్పాటు, నీటి ట్యాంకుల నిర్మాణం లేదా సామర్థ్య పెంపు పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయడం ముఖ్యం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. ఆసుపత్రుల్లో విద్యుత్, నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ రోగులకు నిరంతర వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాలి!

ఉద్యోగ అవకాశాల కల్పనతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలి
ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టిని కలిసిన డా. బరిగెల శివ
నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి
ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి
యువతకు అవకాశాలు కల్పిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

హైదరాబాద్(జై భీమ్ న్యూస్)

తెలంగాణ రాష్ట్ర యువతకు మెరుగైన భవిష్యత్తును అందించడంతో పాటు, ఉద్యోగ అవకాశాల కల్పనలో యువతీ యువకులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ జాయింట్ సెక్రటరీ, ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి గారిని ఆయన ఛాంబర్‌లో డాక్టర్ బరిగెల శివ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధి అవకాశాల ఆవశ్యకత, యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యతపై తన అభిప్రాయాలను వివరించారు. ఉద్యోగం అనేది కేవలం ఒక వ్యక్తి జీవనోపాధి మాత్రమే కాదు.. ఒక కుటుంబం ఆర్థిక స్వావలంబనకు, ఆత్మగౌరవానికి, మెరుగైన భవిష్యత్తుకు పునాది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతీ యువకులకు తగిన అవకాశాలు లభిస్తే వారి జీవితాల్లో గొప్ప మార్పు తీసుకురావచ్చని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలు, ప్రతిభను నిరూపించుకునే వేదికలు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అర్హత, ప్రతిభ, నైపుణ్యాలకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ సమస్యను తగ్గించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయవచ్చని వివరించారు. యువతకు అవకాశాలు కల్పిస్తే కుటుంబాలు బలోపేతమవుతాయి.. కుటుంబాలు బలోపేతమైతే సమాజం అభివృద్ధి చెందుతుంది.. సమాజం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతుంది. ఈ దిశగా ప్రభుత్వం, సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించి యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలను పెంపొందించాలని డాక్టర్ బరిగెల శివ విజ్ఞప్తి చేశారు. యువత జీవితాల్లో వెలుగులు నింపడం, వారి కలలకు రెక్కలు తొడగడం, ప్రతి కుటుంబానికి భవిష్యత్తుపై భరోసా కల్పించడం సామాజిక అభివృద్ధిలో కీలకమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# దళితుల సమస్యల పరిష్కారానికి 'దీనబంధు దర్బార్'

గాంధీభవన్‌లో లాంఛనంగా ప్రారంభం..
వినతులు, ఫిర్యాదుల స్వీకరణ

**హైదరాబాద్, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

దళితుల అభ్యున్నతికి, వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలనే లక్ష్యంతో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'దీనబంధు దర్బార్' కార్యక్రమాన్ని సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే, దీనబంధు దర్బార్ కమిటీ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దళితుల నుంచి వివిధ సమస్యలపై వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. దళితుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం, వారికి న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను, రాష్ట్ర



నాయకులు పరశురాం, చంద్రశేఖర్, హెచ్‌ఆర్ మోహన్, సమతా సుదర్శన్, దబ్బెట రమేష్, సోద రామకృష్ణ, అర్షం అశోక్, పుల్యాల గాంధీ, అందే గంగా జమున, తుల్లా రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్

ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం
కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం



**కేయూ క్యాంపస్, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఆదివాసీల హక్కుల సాధన కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీమ్ అని, ఆయన ఆదివాసీల ఆరాధ్య దైవమని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవన ప్రాంగణంలో ఎస్సీ/ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ ఎ. రాజు అధ్యక్షతన నిర్వహించిన కొమరం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమరం భీమ్ సాగించిన పోరాటం, ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, వాటి పరిరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఉపకులపతి ఆదేశాల మేరకు ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ, కొమరం భీమ్ ఇచ్చిన లి"జల్, జంగిల్, జమీన్"లి నినాదం ఆదివాసీల జీవన హక్కులతోపాటు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటుతుందని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ, ఆదివాసీలు తమకు లభించాల్సిన హక్కులను పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. 1/70 చట్టం అమల్లో ఉన్నప్పటికీ ఆశించిన ప్రయోజనాలు అందరికీ పూర్తిస్థాయిలో చేరడం లేదని అన్నారు. విద్యార్థులు ఆదివాసీల హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ చిర్రా రాజు, ఆచార్య హనుమంత్, ఆచార్య వై. వెంకయ్య, ఆచార్య ఎన్. ప్రసాద్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# బాలికలు, మహిళల అభ్యున్నతికి అందరూ తోడ్పడాలి

ప్రభుత్వ స్వధార్ హోమ్‌లో డాక్టర్ అనితా రెడ్డి



**హనుమకొండ, 26 అక్టోబర్ 2026 ( జై భీమ్ న్యూస్)**

బాలికలు, మహిళల విద్య, రక్షణ, అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా తోడ్పడాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని ప్రభుత్వ స్వధార్ హోమ్‌ను సందర్శించి మహిళలు, పిల్లలకు పౌష్టికాహారం, విద్యా విలువలు, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల విద్య కుటుంబానికే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. బాలికలు, మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు తల్లిదండ్రులతోపాటు సమాజం ప్రోత్సాహం అందించాలని సూచించారు. బాలికలకు బాల్యవివాహాలు చేయకుండా, బాల కార్మికులుగా మారకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆదరణకు నోచుకోని బాలికలు, మహిళలకు విద్య, రక్షణ, ధైర్యం కల్పించడంలో ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు అందమైన బాల్యాన్ని బహుమతిగా అందించాలి. అని డాక్టర్ అనితా రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం స్వధార్ హోమ్‌లోని మహిళలు, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోమ్ సిబ్బంది, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ముగిసే వరకు పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ రద్దు

జిల్లా ఎస్పీ బిందు మాధవ్

**కాకినాడ, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ ముగిసే వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం పీజీఆర్ఎస్ కార్యక్రమం పునఃప్రారంభంపై తదుపరి సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

# అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తే చర్యలు

నవంబర్ 2లోగా తాత్కాలిక లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకోవాలి
వరంగల్ సీపీ ఎన్. శ్వేత, ఐపీఎస్ హెచ్చరిక

**వరంగల్, అక్టోబర్ 26(జై భీమ్ క్రైమ్ న్యూస్)**



దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా విక్రయాలపై వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక దృష్టి సారించింది. తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ స్పష్టం చేశారు. తాత్కాలిక బాణాసంచా విక్రయాలకు అనుమతులు కోరే వారు అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన పూర్తి దరఖాస్తులను నవంబర్ 2వ తేదీలోపు సంబంధిత డీసీపీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. తాత్కాలిక బాణాసంచా విక్రయ లైసెన్స్‌లకు అధికారికంగా దరఖాస్తు చేసే విధానం అందుబాటులో ఉంది. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ ఎన్ఓసీ, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, గతంలో లైసెన్స్ ఉంటే దాని ప్రతితో పాటు అవసరమైన చోట్ల పక్క స్థల యజమానుల అనుమతి పత్రాలు, సైట్ ప్లాన్ బ్లూప్రింట్ సమర్పించాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ. 800 చెల్లించిన బ్యాంక్ చలాన్‌ను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. బాణాసంచా విక్రయ కేంద్రాలకు అగ్నిమాపక శాఖ కూడా నిబంధనల ప్రకారం ఎన్ఓసీ జారీ చేస్తుంది. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేస్తారు. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపట్టినా, నిబంధనలను ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ ఎన్. శ్వేత హెచ్చరించారు. దీపావళి నేపథ్యంలో అనధికారికంగా బాణాసంచా నిల్వ చేయడం, విక్రయించడం వంటి వాటిపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. వరంగల్ జిల్లాలో ఇటీవల లైసెన్స్ లేకుండా భారీగా బాణాసంచా నిల్వ చేసిన ఘటనలో పోలీసులు రూ. 7.62 లక్షల విలువైన బాణాసంచాను స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.

# రామాయణ కావ్యాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హన్మకొండ, అక్టోబర్ 26(జై భీమ్ న్యూస్)**

రామాయణం వంటి మహా కావ్యాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రామాయణ కావ్యకర్త మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. వాల్మీకి మహర్షి కేవలం కవి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, ధర్మానికి మూలాలకు వెలుగునిచ్చిన గొప్ప మార్గదర్శి అని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి చూపిన ధర్మ మార్గంలో నడవడం, మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం ద్వారా ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎస్. లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఓటు చోరీపై కాంగ్రెస్ నిరసన..

'ఓట్ బచావో--దేశ్ బచావో' నినాదం
డీసీసీ భవన్‌లో సమావేశం.. ఓటర్ల జాబితాపై ఆరోపణలు




**హన్మకొండ, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

'ఓట్ బచావో--దేశ్ బచావో' నినాదంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ డీసీసీ భవన్‌లో ఓటు చోరీ అంశంపై కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల, డివిజన్ స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఈసం పెళ్లి అనిల్ మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాలతో పాటు దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని, ఎన్నికల సంఘం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర నిర్ధారణ అవసరం. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు ఎం.కె.ఆర్. నాయుడు, పీసీసీ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎర్రబెల్లి తదితర నాయకులతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, అక్టోబర్ 26(జై భీమ్ న్యూస్)**



ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని, శాఖల వారీగా వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉండకుండా అవసరమైన చర్యలు చేపట్టి ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలకు ప్రజల నుంచి మొత్తం 303 అర్జీలు అందాయి. ఇందులో హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో 150 అర్జీలు, ఆర్డీవో కార్యాలయాల్లో 16 అర్జీలు, ఎంపీడీవో కార్యాలయాల్లో 137 అర్జీలను అధికారులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి శాఖలో ఉద్యోగులకు మీప్రమాణం (వీవవూతీఖుఝిఖుఎ) యాప్ ద్వారా ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వ్యవస్థను అమలు చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు కార్యాలయ పరిధిలోనే మొబైల్ ద్వారా ప్రతిరోజూ తమ హాజరును నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జిల్లాకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన వారందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలోని పలు గ్రామాల్లో భూముల రీ-సర్వే జరుగుతున్న నేపథ్యంలో సాగునీటి పారుదల, పంచాయతీరాజ్ తదితర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూముల రికార్డులు, వివరాలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి రీ-సర్వే ద్వారా ధ్రువీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్‌డీవో మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధం!



**రూ.25 లక్షల ఆస్తి నష్టం.. బాధితులకు అండగా ఉంటాం**

**డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**

**నర్సంపేట, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

నర్సంపేట అంగడి సెంటర్‌లోని నెహ్రూ పార్క్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధమై సుమారు రూ.25 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఈ ఘటన గురించి తెలుసుకున్న బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి సోమవారం ఉదయం ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు.ప్రమాదంలో జరిగిన నష్టాన్ని బాధితులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కష్టకాలంలో బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని, వారికి న్యాయం జరిగే వరకు తన వంతు సహకారం అందిస్తానని డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు గూడూరు సందీప్, తనుగుల అంబేద్కర్, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్ గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి వీరన్న, మాజీ ఎంపీటీసీ రాజు, సీనియర్ నాయకుడు దుగ్యాల సమ్మయ్య, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు గోస్కుల సందీప్ యాదవ్, యువ మోర్చా నాయకుడు కొంకీస విఘ్నేష్ గౌడ్, నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి సూత్రపు సరిత, ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్, కాసుల నాగేంద్రబాబు, చిలువేరు అన్వేష్, రాకేష్, అనిల్, అజీమ్, తరుణ్ సాయి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అంశం పక్కాగా నమోదు చేయాలి!

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**

**పెండింగ్ నోటీసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి**

**భౌతిక, ఆన్‌లైన్ రికార్డులను భద్రంగా నిర్వహించాలి**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**



**వరంగల్, 26 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు.

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి**

ఎస్ఐఆర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న సుమారు 4.50 లక్షల పనులను మూడు నుంచి నాలుగు రోజుల్లో, వారాంతంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**అనర్హతకు సంబంధించి ఆధారాలు తప్పనిసరి**

ఓటరు జాబితాలో పేర్లను చేర్చడం, తొలగించడం వంటి అంశాల్లో తగిన ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలను భద్రపరచాలని స్పష్టం చేశారు. అనర్హమైనవిగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, సంబంధిత పత్రాలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తుల ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు తెలిపారు.రాజకీయ పార్టీలు, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారులు లేదా ఇతరులు ఆధారాలు కోరినప్పుడు అందించేందుకు రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

**ఫారం-6, ఫారం-7 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి**

ఫారం-6 దరఖాస్తుల పరిశీలనతో పాటు పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఫారం-7కు సంబంధించిన పెండింగ్ పనులను కూడా అదే గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ప్రతి దరఖాస్తుకు సంబంధించిన పత్రాలు, ఆధారాలను సక్రమంగా భద్రపరచాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎల్ఓ, ఏఎల్ఓ, ఈఆర్ఓ, బీఎల్ఓ స్థాయిల్లో భౌతిక, ఆన్‌లైన్ రికార్డులను భద్రంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు తలెత్తినా, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తులు వచ్చినా అవసరమైన సమాచారం, ఆధారాలను వెంటనే అందించేలా రికార్డుల నిర్వహణ ఉండాలని సూచించారు.

**గడువులోగా పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేస్తాం: కలెక్టర్**

